గించిన స్పందన చూసి జాయచోడుడు మళ్లా నోరు వెళ్ల బెట్టాడు. ఇది మరొక మలుపు తీసుకుంది.

''అప్పుడు అబ్బాయి అని ప్రకటించారు.. అంటే మోసం చేశారు. ఇప్పటివరకూ అబ్బాయిగానే ఉంచారు. అదెలా సాధ్యం!? ఇప్పుడు అమ్మాయి అంటున్నారు. ఇదేం పద్ధతి?''

''అబ్బాయి కాస్తా అమ్మాయిగా మారిపోయాడు. మరైతే ఇక వారసుడు మురారిదేవుడే!!''

''అంతే అంతే! అతను మహావీరుడు జాయపచోడ దేవులవారి మేనల్లుడు. మేనమామ పోలికలు వస్తాయి కదా!''

''అవునవును. నా అభిప్రాయమూ అదే. మురారిదేవుడు జాయచోడుల వారి అందచందాలు పుణికి పుచ్చుకున్నాడు. ఆ యుద్ధ చాతుర్యం వస్తే ఇక కాకతీయరాజ్యానికి తిరుగుండదు..''

రానురానూ పురవాసులలో మురారిపట్ల వ్యామోహం పెరుగుతోంది.

''మా యువరాజు మురారిదేవుడు'' అని జనులు చెప్పుకొంటున్నారు.

అంతఃపురంలో అంతా ఆనందమే కానీ.. మురారి యుద్ధ నైపుణ్యత, మంత్రాంగ విశారద విస్తృతం కావాలి. అప్పుడే గణపతిదేవుని వారసుడిగా మహోన్నతస్థానం అధిరోహించగలడు. ఇది తండ్రి, మేనమామల సంయుక్త ఆలోచన.

''నాయన గారూ.. నా విద్యాభ్యాసం పూర్తయిందని గురుదేవులు చెప్పారు. తదుపరి తమరి ఆదేశం ఏమిటో..'' అడిగాడు మురారి, తండ్రితో జాయచో డుని సమక్షంలో.

ఇప్పటికే చదువు ధ్యాస వదిలేసి రాజనగరి, అనుమ కొండ వీధులు అన్నీ చక్కబెట్టేస్తున్నాడు. గణపతిదేవుడు కొడుకు బుగ్గలు పుణికాడు మురిపెంగా. నారాంబ అక్క అయితే కొడుకుని చూసుకుని తమ్ముణ్ని పట్టించుకో వడం లేదు. కొత్త కొడుకు.. పాత తమ్ముడు!!

''నీ మేనల్లుడికి మూతిమీద మీసాలు మొలుస్తున్నై. చూడు.. ఏమైనా ప్రయోజకుడు అయ్యాడేమో..'' అన్నాడు.

''వీడి సంగతి నాకు వదిలేయండి బావగారు..'' అన్నాడు జాయచోడుడు.

మురారి, రుద్రమదేవి ఎప్పుడూ అన్యోన్యంగా ఉంటారు. ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకుని తిరుగుతుం డటం చూసి.. జాయచోడుడు ముచ్చటపడగా నారాంబ ఇద్దరికీ దిష్టి తీసింది. గణపతిదేవుడు అన్నాడు మురి పెంగా..

''మీ అక్కాతమ్ముళ్లను మళ్లీ చూస్తున్నట్లుగా ఉంది..''

* * *

అంతా ప్రశాంతంగా ఉన్నట్లు భావించినా.. కాలపు రుషుడు తన ధర్మాన్ని నిర్వర్తిస్తూనే ఉంటాడు కదా!

రాజధాని అనుమకొండ మరోమారు పెద్ద కుదుపు నకు గురయ్యింది.

పట్టమహిషి సోమలదేవి స్వర్గస్తురాలయ్యింది. దీర్ఘ కాలంగా అంతుచిక్కని జబ్బుతో బాధపడుతూ తల్లా నికే అంకితమైన సోమల.. గతరాత్రి మరణించింది. రాజ్యమంతా దుఃఖసాగరంలో మునిగింది. స్తబ్ధుగా ఉండిపోయాడు గణపతిదేవుడు. ఎక్కువ దుఃఖపడింది నారాంబ. ఆమెకు దాదాపు మూడేళ్లుగా సపర్యలు చేస్తోంది.

ఆమె దహన సంస్కారాలకు అనుమకొండ అంతా తరలివచ్చింది. దేవగిరి నుండి ఆమె అన్న సింఘణదేవ మహారాజు ఇతర బంధుమిత్ర సపరివారంగా తరలివ చ్చారు. పుణ్యస్త్రీగా చనిపోయిన సోమలకు ఎన్నో శాంతి హోమాలు నిర్వహించారు శైవగోళకీ మతాచార్యులు. పండితులకు, బ్రాహ్మణులకు వేలవేల గోవులను, భూములను దానమిచ్చాడు గణపతిదేవుడు. ఆయన పక్కన నిలుచుని సహకరించాడు జాయచోడుడు.

ఈ క్రతువులలో ఆయనకు ఓ వింతదృశ్యం పొడగట్టింది.

మురారి వెంట ఎప్పుడూ పెద్ద మిత్రబృందం కనిపి స్తోంది. మురారి అందరినీ హత్తుకుంటూ, కలుపుగో లుగా ముచ్చటిస్తూ ఆకర్షిస్తున్నాడు. బృందం కూడా దూకుడుగా ఉంది.

రుద్రమ ఎప్పుడూ సౌమ్యంగా హుందాగా కనిపి స్తోంది. ఆమెను చూసి ముచ్చటపడతాడు జాయచో డుడు. ఏ ఇంటికి వెళుతుందో.. తప్పకుండా మెట్టినిం టికి, పుట్టినింటికి ప్రఖ్యాతి తెస్తుంది. ధరణికోట వంశీ యుల కోడలిగా వెళ్లిన గణపాంబ కూడా భర్తకు చేదోడు వాదోడుగా రాణిస్తున్నట్లు వార్తలు వస్తుండటం విని.. అంతా ఆనందంగా ఉన్నారు. అయితే సోమల పుణ్యతి థుల కార్యక్రమాలలో రుద్రమదేవి వెంట కనిపించిన వ్యక్తిని చూసి జాయచోడుడు నిర్ఘాంతపోయాడు.

ప్రసాదిత్య నాయకుడు!! సోమల చనిపోయాక కూతురు పక్కన చేరాడన్నమాట.

ఆంధ్ర సామ్రాజ్య స్థాపనా దీక్షలో గణపతిదేవుడు తీవ్ర సమస్యలలో కొట్టుమిట్టాడుతున్నాడు. అందుకు ఆయన అసిధారావ్రతం చేస్తున్నాడు. అవన్నీ తన పరిధి లోని అంశాలు కావని జాయచోడుని అభిప్రాయం.

చెయ్యమంటే యుద్ధం. కాదంటే నాట్యం. అంతవ రకే పరిమితం. కాకపోతే ఇప్పుడు పిల్లల సంగతి నెత్తిన పెట్టాడు. పెద్దబిడ్డ గణపాంబ అత్తారింటికి వెళ్లి పోగా.. రెండవబిడ్డ రుద్రమ, ఏకైక కుమారుడు మురారి. ఇద్దరూ కళ్లముందు కన్నుల పండువగా తిరుగాడుతున్నారు. రుద్రమదేవికి పెళ్లిచేసి పంపిస్తే.. ఏకైక కుమారుడు మురారి కాకతీయ సింహాసనాన్ని అధిరోహిస్తాడు.

గణపాంబ యుద్ధవిద్యల పట్ల అంత ఆసక్తి కనబరచ లేదు. అందుకే ఆమెను ప్రాథమిక విద్య అనంతరం పెద్దపెద్ద అనుభవజ్ఞులైన ప్రధానులు, యుద్ధ తంత్రజ్ఞు లతో, ధర్మశాస్త్ర పండితులతో రాజప్రాసాదంలోనే రాజ్య పాలన, వ్యవస్థల నిర్వహణలో శిక్షణ ఇప్పించాడు.

రుద్రమ చదువుకున్న త్రిపురాంతక గోళకీమఠ విద్యా కేంద్రం యుద్ధవిద్యలలో ప్రఖ్యాత కేంద్రం. ప్రాథమిక విద్య అనంతరం రుద్రమ యుద్ధవిద్యల్లో ఆసక్తి, ప్రతిభ కూడా చూపిందని గురువుల నివేదన.

మురారి.. గణపాంబ వివాహానికి హాజరయ్యేనాటికి ప్రాథమిక విద్య విసురునాడులోని సంస్కృత ఘటికలో పూర్తి చేసుకున్నాడు.

గణపాంబ వివాహం, సోమల మరణానంతరం రుద్రమను దగ్గరే ఉంచుకున్నాడు గణపతిదేవుడు.



కొంకణభట్టు వద్ద రాజనీతిశాస్త్రాల్లో శిక్షణ పొందు తోంది. మురారిని యుద్ధవిద్యలలో ప్రత్యేకశిక్షణ కోసం రుద్రమ చదివిన త్రిపురాంతక గోళకీమఠ విద్యాకేంద్రా నికి పంపాడు జాయచోడుడు.

* * *

కాకతీయ రాజ్యం, సమాజం ఇప్పుడొక సంధికా లంలో ఉంది.

అనుభవ కాకతీయానికి, యువ కాకతీయానికి మధ్య ఈ సంధికాలంలో గణపతిదేవుడు.. జాయచో డుడు, తిక్కనామాత్యుల నేతృత్వంలో పూర్తి తెలుగు సామ్రాజ్య స్థాపన కోసం విశేష పోరాటం చేస్తున్నాడు.

విష్ణుకుండినుల కాలంలో వెలుగొంది నేడు శిథిల మైన పానుగల్లు కళాక్షేత్రాన్ని తిరిగి నిర్మించాడు జాయ చోడుడు. పీఠభూమి రాజ్యాల కళాకారులకు అది గొప్ప కళాక్షేత్రమయ్యింది.

కొంతకాలం దేశసంచారం చేయాలని ఆయన మన సులో బలంగా ఉంది. అనుమకొండ కళామందిరంలో కూడా ఈ చర్చ వచ్చింది.

''అఖండ భారతమంతా తిరుగుతూ నాట్యకళాప్రద ర్శనలతో తెలుగువారి ఖ్యాతిని చాటుతున్న నాట్యబృం దాలు, వాగ్గేయకారులు మీ వెలనాడువారే ప్రభూ.. మీ కూసెనపూండి కళాక్షేత్రం ప్రభావంతో ఎందరెందరో కవులు, వాగ్గేయకారులు, నాట్యాచార్యులు, యక్షగాన నిపుణులు తయారయ్యారు. ఏ రాజ్యమైనా వెళ్లండి. ఏ రాజాస్థానమైనా సందర్శించండి. వెలనాడు కవో పండి తుడో నాట్యకారుడో సంగీతజ్ఞుడో వాగ్గేయకారుడో అప్ప టికే అక్కడ గండపెండేరం తొడిగించుకుని ఉన్నతా సంపై కూర్చుని ఉంటాడు..''

ఇలాంటి పండితుల వ్యాఖ్యలు విన్నప్పుడు జాయ చోడుడు ఉబ్బితబ్బిబ్బు అవుతాడు.

ప్రాంతీయభాషలు స్పష్టమయ్యాక ఆయా రాజ్యా లను కూడా.. తమిళ రాజ్యాలు, కన్నడ రాజ్యాలు, మలయాళ రాజ్యాలు, ఓఢ్ర రాజ్యాలు, మరాఠా రాజ్యాలు.. అంటున్నారు. ఆయా స్థానికభాషలలో లిఖిత సాహిత్యం, ప్రదర్శన సాహిత్యం, నాట్య, సంగీత, వాద్య సంప్రదాయాలు కూడా కొత్త సృజనా త్మక కెరటాలతో సాంస్కృతిక సముద్రాల్లా ఎగసిపడుతు న్నాయి. వాటన్నిటినీ పరిశీలించాలని జాయచోడుని ఉబలాటం.

ఓ పూర్తిస్థాయి నాట్యమేళంతో దక్షిణరాజ్యయాత్రకు కదిలాడు. రాజలిపికారుడు నందియార్యుడు, కూసెన పూండి కళాక్షేత్రం నిర్వాహకుడు పరాశరుడు, అనుమ కొండ కళాప్రాంగణ నిర్వాహకుడు రాజనాయకుడు, సంగీత విద్వాంసుడు కాసెప్ప, డప్పు వాద్యకారుడు సూరపృడు, మార్దంగికుడు వెంకటప్ప, కాహళి వాద్య కారుడు కొమ్మన, పల్లకి బంటులు, విక్రమ తదితర వాహన జంతువులు, వాటి నిర్వాహకులు.. ఆ నాట్య మేళంలో ఉన్నారు.

మేళం వివిధ రాజ్యాలగుండా పోయిపోయి చేర రాజ్యం దక్షిణ సముద్ర అంచులవరకూ వెళ్లింది. అక్కడి నుండి కదిలి దేవాలయాలు, శిల్ప, నాట్య, సంగీత సంప్రదాయాలు చూస్తూ, పోల్చి, బేరీజు వేసుకుంటూ చేర రాజ్యాలు, తమిళ రాజ్యాల్లోని రాజాస్థానాలు, దేవాలయ స్థానాపతులు బలవంతం చేస్తే నృత్తం ప్రద ర్శిస్తున్నాడు.

కానీ, ఎందుకో మనసు లగ్నం కావడం లేదు. ఏదో చేశాడు అంటే చేశాడు!

(సశేషం)